ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

శుక్రవారం 21 ఫిబ్రవరి 2025

న్యూస్ బాక్స్

ఉచిత వైద్య శిబిరం

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిరిసిల్ల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్ల పట్టణంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (టౌన్‌క్లబ్) బ్యాంచ్ మేనేజర్ వేణు ప్రారంభించారు. శిబిరంలో డాక్టర్ శ్రీకాంత్ బీపీ, షుగర్, ఈసీజీ, గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడారు. పట్టణ ప్రజలకు సూపర్ స్పెషలిటీ వైద్య సేవలను అందించాలన్న లక్ష్యంతోనే ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించామన్నారు. మెడికవర్ ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, లక్ష్మి, బ్యాంక్ ఉద్యోగులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

వైశ్య సంఘం సంబురాలు


ముస్తాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ సీఎం రేఖాగుప్తా ప్రమాణ స్వీకారం సందర్భంగా ముస్తాబాద్ మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కూర సంతోష్ ఆధ్వర్యంలో గురువారం సంబురాలు జరిపారు. రేఖాగుప్తాకు శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్లు పంపిణీ చేశారు. టపాసులు పేల్చి సంబురాలు జరిపారు. ఆర్యవైశ్య ముద్దు బిడ్డ రేఖాగుప్తాను సీఎం చేయడం అక్కడి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కూర సంతోష్, కూర బిక్షపతి, గందె చంద్ర, కొండాపూర్ రాజుసెర్, రమేశ్, విజయ్‌కుమార్, కొత్తపెల్లి శ్రీనివాస్, కృష్ణమూర్తి ఉప్పల చంద్రం, గందె నరేశ్, నార్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లాలో పట్టభద్రుల ఓటర్లు	
బోయినపల్లి	1,807
చందుర్తి	962
కోనరావుపేట	1,496
రుద్రంగి	392
వేములవాడ	3,429
వేములవాడ రూరల్	970
సిరిసిల్ల	5,117
ఇల్లంతకుంట	1,969
గంభీరావుపేట	1,226
ముస్తాబాద్	1,495
తంగళ్లపల్లి	1,561
వీర్నపల్లి	532
ఎల్లారెడ్డిపేట	1,441

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు	
బోయినపల్లి	46
చందుర్తి	28
కోనరావుపేట	35
రుద్రంగి	18
వేములవాడ	177
వేములవాడ రూరల్	27
సిరిసిల్ల	272
ఇల్లంతకుంట	77
గంభీరావుపేట	66
ముస్తాబాద్	70
తంగళ్లపల్లి	37
వీర్నపల్లి	15
ఎల్లారెడ్డిపేట	82

గులాబీ శ్రేణుల్లో అసంతృప్తి..



- ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరం.. స్థానిక ఎన్నికలపై ప్రభావం
- జిల్లాలో ఇతర పార్టీల ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారం
- బలగం ఉన్నా నిరాశగానే మిగిలిన బీఆర్ఎస్ నేతలు
- ఎటూ తేల్చుకోలేని డైలమాలో క్యాడర్
- జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓటర్లు 23,347 మంది

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలు బీఆర్‌ఎస్‌కు మానని ఓటమి గాయాన్ని మిగిల్చింది. ఓడినా ప్రజల్లోనే ఉంటామని అధికారం కోల్పోయిన సందర్భంలో నేతలందరూ ప్రకటనలు చేశారు. ఆ తరువాత బీఆర్ఎస్‌కు చెందిన నేతలు కొందరు రాజధానికే పరిమితం కాగా, మరికొందరు సబ్దతగా ఉండిపోయారు. జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలతో పాటు జిల్లాకు చెందిన బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాలు ఇతర నియోజకవర్గాల్లో ఉన్నాయి. జిల్లా పరిధిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహించారు. శాసనసభ ఎన్నికల్లో పరిస్థితులు తారుమారయ్యాయి. కేవలం సిరిసిల్ల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. వేములవాడ, ఇతర నియోజకవర్గాలకు సంబంధించి కాంగ్రెస్ ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. దీంతో పాటు జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మున్సిపల్, సర్పంచ్‌ల పదవీ కాలం కూడా పూర్తి కావడంతో ఆ పార్టీకి స్థానిక సంస్థల్లోనూ ప్రాతినిధ్యం లేకుండా పోయింది. దీంతో జిల్లాలో బీఆర్ఎస్ సందడి తగ్గిపోయింది. ఈక్రమంలోనే వచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికలు బీఆర్ఎస్ పార్టీ క్యాడర్‌లో జోష్ నింపుతుందని భావించినా నిరాశే నెలకొంది. మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 71 మంది బరిలో నిలిచారు. ఉపాధ్యాయ అభ్యర్థులు 15 మంది, పట్టభద్రుల అభ్యర్థులు 56మంది ఉన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వి నరేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ, ఆల్‌ఇండియా కిసాన్ జనతా పార్టీ అభ్యర్థి చంద్రశేఖర్, తెలంగాణ ప్రజాశక్తి పార్టీ అభ్యర్థి డాక్టర్ వెంకటేశం, ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్, విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థి బక్క జడ్సన్, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి మంద జ్యోతి, తెలంగాణ ద్రవిడ ప్రజల పార్టీ అభ్యర్థి బొల్లి సుభాష్, నేషనల్ నవక్రాంతి పార్టీ అభ్యర్థి చిలువేరి ఇంద్రా గౌడ్‌లతో పాటు 44మంది స్వతంత్రులు బరిలో ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య, బీఎస్పీ అభ్యర్థి యాటకారి సాయన్న, దళిత బహుజన పార్టీ అభ్యర్థి గవ్వల లక్ష్మీలతో పాటు స్వతంత్రులుగా వై అశోక్‌కుమార్, కంటె సాయన్న, కూర రఘోత్తంరెడ్డి, చంద్రశేఖర్, జగ్గు మల్లారెడ్డి, తిరుమల్‌రెడ్డి, జన్నారెడ్డి, సుధాకర్‌రెడ్డి,

మిగతా 8లో

ప్రభుత్వ నిధుల దుర్వినియోగాన్ని బయటకు తీస్తాం

- చట్టాన్ని సంరక్షించే కలెక్టర్‌పై నిందలు వేస్తున్నారు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సిరిసిల్లలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పాలనలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇళ్లలో అవినీతి అక్రమాలు, భూబాగోతాలు, ప్రభుత్వ నిధుల దుర్వినియోగాన్ని బయటకు తీస్తామని, బాధ్యులైన ఏ ఒక్కరిని వదలిపెట్టబోమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ బరితెగిస్తున్నదని, మానసిక ఆనందం పొందడం కోసం సోషల్ మీడియాలో పెడుతున్న పోస్టింగ్‌లే అందుకు నిదర్శనమన్నారు. ఐఏఎస్ అధికారిని అనరాని మాటలు అన్నరోజు తాము ఖండించామని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశామన్నారు. రెండు రోజులుగా దుబాయ్ కేంద్రంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోషల్ మీడియా అకౌంట్స్ ద్వారా జిల్లా కలెక్టర్‌పై అనేక ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సుమారు వెయ్యి ఎకరాలకు పైనే ప్రభుత్వ భూములను కబ్జా చేశారని ఆరోపించారు. కబ్జా చేసిన భూబాగోతాలు వెలికితీస్తూ చట్టాన్ని కాపాడుతూ ప్రభుత్వం ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ బీఆర్ఎస్ నాయకుల కంట్లో కలెక్టర్ నలసయ్యాడని భావించారన్నారు. కబ్జా చేసుకున్న భూములు తిరిగి ప్రభుత్వానికి వెళ్లి పోతాయని బీఆర్ఎస్ నాయకులు కలెక్టర్ వ్యక్తిగత జీవితంలోకి తొంగి చూస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున్న సిరిసిల్లలో కేటీఆర్ బొమ్మతో ప్రభుత్వ స్థలంలో కట్టిన ఫ్లెక్సీని తీయాలని కలెక్టర్ చెప్పడం తప్పా అని ప్రశ్నించారు. వ్యాపారి ఉపాధి పోగొట్టాలన్న ఆలోచన తమకు లేదని చిరు వ్యాపారులకు తమ ప్రభుత్వం వ్యతిరేకం కాదన్నారు. ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో రాజకీయ నాయకులు ఫోటోలు ఉండరాదని అధికారులు చెప్తుంటే బీఆర్ఎస్ నాయకులకు కనీస పరిజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలయ్యేలా చూడాలని ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కోరుతున్నామన్నారు. అవినీతి అక్రమాలను బయటకు తీస్తున్న ప్రభుత్వ అధికారులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కాగా, కాంగ్రెస్‌పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ తవ్వినకొద్ది బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి బయటకు వస్తున్నాయన్నారు. అప్పటి ప్రభుత్వ పథకాలు సామాన్య ప్రజలకు చేరలేదన్నారు. సమావేశంలో గ్రంథాలయం జిల్లా చైర్మన్‌నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెల్మూల స్వరూప తిరుపతిరెడ్డి, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత, జిలా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వంగమల్లేశంగౌడ్, మాజీ కౌన్సిలర్లు ఆడెపు చంద్రకళ, కుడకాల రవికుమార్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించని బీఆర్ఎస్ ప్రభుత్వం..

- సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల ఐక్యవేదిక నాయకులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్లలో తయారు చేసిన బతుకమ్మ చీరలకు రావాల్సిన డబ్బులను ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీపై అసత్యపు ప్రచారాలను చేయడాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేదని సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల ఐక్యవేదిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వస్త్ర పరిశ్రమల ఐక్య వేదిక నాయకులు తాటిపాముల దామోదర్, ఆడెపు భాస్కర్, దూడం శంకర్, పంతం రవిలు మాట్లాడుతూ బతుకమ్మ చీరలకు సంబంధించిన డబ్బులను చెల్లించకుండా గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టడంతోనే వస్త్ర పరిశ్రమలు సంక్షోభంలో కూరుపోయాయని, దీనిపై బీఆర్ఎస్ నాయకులు బహిరంగ చర్చలకు రావాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం హయాంలో బతుకమ్మ చీరలను తయారు చేసిన అసెంబ్లీ ఎన్నికలకు ముందే అందించగా వాటికి బిలులను చెల్లించకుండా యాజమానులను ఇబ్బందులకు బీఆర్ఎస్ ప్రభుత్వం గురిచేసిందన్నారు. మోసపూరిత మాటలతో ప్రజలను తప్పుతోవ పట్టించే ప్రకటనలను బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి చేయడం సరైంది కాదన్నారు.

ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు అసత్యపు ప్రచారాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు అంకాలపు రవీందర్, బూట్ల నవీన్‌కుమార్, బండారి అశోక్, నల్ల ప్రదీప్, శ్రీగాధ మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్రహారం పాల శీతలీకరణ కేంద్రం సీజ్

భగ్గుమన్న పాడి రైతులు

- అగ్రహారం పాల శీతలీకరణ కేంద్రం మూసివేత వివాదం
- జిల్లాలో నిలిచిపోయిన 45 వేల లీటర్ల పాల సేకరణ
- అయోమయంలో 18 వేల మంది పాడి రైతులు



కనగర్తి పాల కేంద్రం వద్ద రైతులు

సిరిసిల్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాలుగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాజన్న సిరిసిల్ల జిల్లా పాడి రైతులు కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీకి సంబంధించిన జిల్లాలోని వేములవాడ మండలం అగ్రహారం శీతలీకరణ కేంద్రానికి పాలు అందిస్తున్నారు. గురువారం పరిశ్రమల శాఖ నుంచి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, రెవెన్యూ శాఖ నుంచి ల్యాండ్ కన్వర్షన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మున్సిపల్ శాఖ నుంచి అనుమతులు లేని కారణంగా చెబుతూ అధికారులు పాల శీతలీకరణ కేంద్రాన్ని సీజ్ చేశారు. దీంతో ఒక్కసారిగా రైతులు ఇబ్బందుల్లో పడ్డారు. శీతలీకరణ కేంద్రాన్ని మూసివేతలకు ఏలాంటి నోటీసులు ఇవ్వలేదని నిర్వాహకులు చెబుతున్నారు. కలెక్టర్ వేములవాడ టౌన్‌ప్లానింగ్ అధికారులు ముందస్తు నోటీసులు జారీచేయగా వాటిని తీసుకోవడానికి నిరాకరించారని ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పాడి రైతులకు ఇబ్బందులు కలగకుండా విజయ డెయిరీ ద్వారా అధిక ధరకు పాలను సేకరిస్తామని ఇబ్బందులు ఉంటే తెలియజేయాలంటూ సెల్ నంబర్లను ప్రకటించారు. కానీ పాల కేంద్రాన్ని కేవలం కక్ష సాధింపుల్లో భాగంగానే మూసివేశారనే ప్రచారం సాగుతోంది. పాల శీతలీకరణ కేంద్రం మూసివేశారనే సమాచారం అందుకున్న రైతులు కేంద్రం వద్దకు తరలివచ్చి రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. భారీ పోలీస్ బందోబస్తు మధ్య రైతులను పంపించారు. అగ్రహారం ప్లాంట్‌పరిధిలో 18వేల మంది రైతులు ప్రతి రోజు ఉదయం, రాత్రి 45 వేల లీటర్ల వరకు పాలను అందిస్తున్నారు. ప్లాంట్ మూసివేసిన విషయం తెలియక గురువారం రాత్రి పాలక్యాన్లతో గ్రామాల్లో కేంద్రాలకు వచ్చి పడిగాపులు పడ్డారు. గంభీరావుపేట పాలక్యాన్లతో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. గ్రామాల్లోని కేంద్రాల వద్ద పాల క్యాన్లతో నిరసన తెలిపారు.

- గ్రామపంచాయతీ, ఇండస్ట్రియల్ అనుమతులు లేవన్న అధికారులు - రైతుల ఆందోళనతో ఉపసంహరణ

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం అగ్రహారం గ్రామంలోని కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ పాల శీతలీకరణ కేంద్రాన్ని గురువారం గ్రామపంచాయతీ కార్యదర్శి నరేష్ ఆధ్వర్యంలో అధికారులు సీజ్ చేశారు. 2003 సంవత్సరం నుంచి పాల శీతలీకరణ కేంద్రం పని చేస్తోందని, కనీసం ఇప్పటివరకు గ్రామపంచాయతీ అనుమతులు కానీ, ఇండస్ట్రియల్ అనుమతులు కానీ లేకపోవడంతో పలుమార్లు తమ సిబ్బంది నోటీసులు ఇచ్చినా సంబంధిత కంపెనీ సభ్యులు నోటీసులను తిరస్కరించారని అన్నారు. దీంతో గురువారం గ్రామపంచాయతీ కార్యదర్శి, టౌన్ ప్లానింగ్ అధికారి, ఇండస్ట్రీయల్ ఏడీ ఆధ్వర్యంలో డెయిరీని సీజ్ చేశారు. అయితే జిల్లా వ్యాప్తంగా రైతులు నిరసన వ్యక్తం చేయడంతో రాత్రి పదిన్నర గంటల ప్రాంతంలో ప్రభుత్వ ఆది శ్రీనివాస్ దగ్గరుండి సీజ్‌ను తొలగింపజేశారు.



కరీంనగర్-సిరిసిల్ల రోడ్డుపై ఆందోళన చేస్తున్న పాడి రైతులు

● రోడ్డుపై బైఠాయించిన పాడి రైతులు..

అగ్రహారం పాల శీతలీకరణ కేంద్రాన్ని సీజ్ చేసిన విషయం తెలుసుకున్న రైతులు ముందుగా డెయిరీ వద్దకు చేరుకుని పాల శీతలీకరణ కేంద్రం ఎదుట అధికారుల తీరుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. పాల శీతలీకరణ కేంద్రం పరిధిలో 145 గ్రామాలకు సంబంధించి 20 వేల మంది రైతులు సభ్యులుగా ఉన్నారని, నిత్యం 18 వేల నుంచి 20 వేల లీటర్ల పాలు అగ్రహారం పాల శీతలీకరణ కేంద్రానికి రైతులు తరలిస్తారని డెయిరీని సీజ్ చేస్తే పాడి రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. డెయిరీ సీజ్‌ను తొలగించాలని గ్రామపంచాయతీ, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, పోలీసులతో పాడి రైతులు వాగ్వాదానికి దిగారు. అధికారులు స్పందించకపోవడంతో కరీంనగర్-సిరిసిల్ల ప్రధాన రహదారిపైన బైఠాయించారు. సుమారుగా రెండు గంటలపాటు రోడ్డుపైన బైఠాయించి కలెక్టర్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. సంఘటన స్థలానికి పెద్ద సంఖ్యలో పోలీసులు తరలివచ్చి రైతులను నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. వినకపోవడంతో రైతులను బలవంతంగా రోడ్డుపై నుంచి తొలగించారు. కాగా గురువారం రాత్రి పాడి రైతులు తమ పాలను తీసుకువెళ్లగా కేంద్రాలు తెరిచి లేకపోవడంతో రైతులు జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ధర్నాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. వేములవాడ మండలం అనుపురం గ్రామంలోని పాడి రైతులు పాల కేంద్రం ఎదుట పాలను పారబోసి నిరసన వ్యక్తం చేశారు.

సరైన అనుమతులు లేకపోవడంతోనే మూసివేత

- కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝూ

సిరిసిల్ల కలెక్టరేట్ : అగ్రహారంలోని కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ డెయిరీ ప్లాంట్‌కు సరైన అనుమతులు లేకపోవడంతో ప్రమాద నివారణ చర్యల్లో భాగంగా తాత్కాలికంగా మూసివేసినట్లు కలెక్టర్ సందీప్ కుమార్‌ఝూ గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. పరిశ్రమల శాఖ నుంచి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, రెవె న్యూ శాఖ నుంచి ల్యాండ్ కన్వర్షెషన్, పొల్యూషన్‌కంట్రోల్ బోర్డు, ము న్సిపల్ శాఖల నుంచి అనుమతులు లేనందున తాత్కాలికంగా కరీంన గర్ డైయిరీని తాత్కాలికంగా మూసివేశామన్నారు. వేములవాడ టౌన్ ప్లానింగ్ అధికారులు ముందస్తు నోటీసులు జారీ చేయగా వాటిని తీసుకోవడానికి నిరాకరించారని కలెక్టర్ పేర్కొన్నారు.

సీజ్ తొలగింపు..

- దగ్గరుండి తొలగించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం అగ్రహారం పాల శీతలీకరణ కేంద్రాన్ని అధికారులు గురువారం సీజ్ చేశారు. అయితే జిల్లా వ్యాప్తంగా పాడి రైతులు నిరసన వ్యక్తం చేయడంతో కలెక్టర్‌తో మాట్లాడి పాల శీతలీకరణ కేంద్రం సీజ్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రాత్రి పదిన్నర గంటల ప్రాంతంలో దగ్గరుండి తొలగించి తిరిగి ప్రారంభించారు. శీతలీకరణ కేంద్రానికి సంబంధించి అనుమతులకు సమయం ఇచ్చి రైతుల ప్రయోజనాల దృష్టిలో ఉంచుకుని తిరిగి ప్రారంభించాలని కోరడంతోనే సీజ్‌ను తొలగించామని, ఈ విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రభుత్వ విప్ తెలిపారు.

మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా జడ్జి ప్రేమలత



మాట్లాడుతున్న జడ్జి ప్రేమలత

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మార్చి 8న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా జడ్జి ఎన్ ప్రేమలత అన్నారు. గురువారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యం లో జిల్లా కోర్టులో పీపీలు, పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేషనల్ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్య లో కేసులను పరిష్కరించాలని కోరారు. దాదాపు 1200కు పైగా పెండింగ్ కేసులు ఉన్నాయని, ఇందులో పోలీస్ స్టేషన్‌ల వారీగా తమ లక్ష్యాన్ని చేరుకోవాలని ఆమె అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ డి చంద్రయ్య, సీనియర్ సివిల్ జడ్జిలు లక్ష్మణ చారి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధికా జైస్వాల్, జూనియర్ సివిల్ జడ్జిలు ఏ ప్రవీణ్, సృజన, జ్యోతిర్మయి, జయశ్రీ, మేఘన, ఏపీపీలు విక్రాంత్, సతీష్ సందీప్, అదనపు పీపీ పెంట శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

మహాశివరాత్రి జాతరకు పటిష్ట భద్రత

- ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ అఖిల్‌మహాజన్



మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు సిబ్బంది అప్రమత్తంగా పటిష్ట భద్రతతో ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఆలయ ప్రాంగాణం, వీఐపీ, వివిఐపీ, జనరల్ పార్కింగ్, శివార్చన, ధర్మగుండం, కల్యాణకట్ట, క్యూలైన్స్ బద్దిపోచమ్మ ఆలయ ప్రాంగాణంతో పాటు పలు ప్రాంతాల్లో చేస్తున్న ఏర్పాట్లను పోలీసులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణకాశీగా పేరుగాంచిన రాజన్న ఆలయంలో ఈ నెల 25వ తేది నుంచి 27వ తేది వరకు నిర్వహించే మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనుబంధ ఆలయాల వద్ద పకడ్బందీగా భద్రత ఏర్పాటు చేస్తామని, గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున ఆలయ ప్రాంగణం, వీఐపీ, వీవీఐపీ, జనరల్ పార్కింగ్, శివార్చన, ధర్మగుండం, కల్యాణకట్ట, క్యూలైన్స్ వద్ద ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంతవాతావరణంలో దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన కూడళ్ల వద్ద రూట్‌మ్యాప్ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట టౌన్ సీఐ వీరప్రసాద్, ఎస్ఐ రాజు, ఈఈ రాజేష్ ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మహాశివరాత్రికి ఉత్సవ కమిటీ ఏర్పాటు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

రంగుమారిన 'రాజన్న' ధర్మగుండం నీరు..

- దుర్వాసన వస్తోందని వాపోతున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో సింగరేణి ఉద్యోగి దుర్మరణం

రామగిరి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పిలో అసిస్టెంట్ ఫోర్‌మన్‌గా పని చేస్తున్న ఉరకుండ రాజ్‌కుమార్(38) అనే సింగరేణి ఉద్యోగి గురువారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి వాగులో పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ ఉదయం పెద్దపల్లి-మంథని ప్రధాన రహదారిలో పెద్దపల్లి నుంచి కల్వచర్ల వైపు ఏపీ15ఏజే 8307నెంబరు గల ద్విచక్రవాహనంలో వస్తున్నారు. మూల మలుపువద్ద వాహనం అదుపుతప్పి బొక్కల వాగులోకి పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి సీఐ రాజుగౌడ్ చేరుకొని మృతదేహన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

- కారకుడంటూ ఓ వ్యక్తి ఇంటి ఎదుట మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన



బాపుసాయిపేటలో ఇంటి ఎదుట ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు

కోనరావుపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోగా, అందుకు ఓ వ్యక్తి వ్యక్తి కారకుడంటూ అతడి ఇంటి ఎదుట మృతదేహంతో బంధువులు ఆందోళన దిగారు. ఇంటిని ధ్వంసం చేయడానికి యత్నించగా విషయం తెలుసుకున్న కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించి మృతదేహన్ని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గ్రామస్థుల కథనం ప్రకారం కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన బత్తుల రేణ(22) అనే వివాహిత బతుకుతెరువు కోసం వేములవాడ రూరల్ గ్రామమైన నాంపల్లిలో ఉంటోంది. నాంపల్లిలో గురువారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గతంలో భర్త మల్లయ్య రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వీరిద్దరి మృతికి కారకుడు అంటూ బావుసాయిపేట గ్రామానికి చెందిన బత్తులఅంజయ్య ఇంటిముందు రేణ మృతదేహంతో ఆందోళన దిగారు. కోపంతో ఇంటిని ధ్వంసం చేయడానికి యత్నించారు. పోలీస్ బందోబస్తు నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా, ఎలాంటి సంఘటన జరగకుండా బావుసాయిపేట గ్రామంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

కోనరావుపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన గుంటి భూమయ్య(62) అనే వృద్ధుడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయం చూసి దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయమై కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి విచారణజరిపి కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు, కారు ఢీ: మహిళకు గాయాలు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని అందుగులపల్లి గ్రామ శివారులో గోదావరిఖని వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్, కారుఢీకొనగా బస్‌లో ప్రయాణిస్తున్న మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం గోదా వరిఖని వైపు వెళ్తున్న బస్‌ను కారు ఓవర్ టేక్ చేస్తూ బస్‌ను ఢీ కొట్టింది. దీంతో అప్రమత్తమైన బస్‌డ్రైవర్ బ్రేక్‌వేయడంతో పెద్దప్రమాదం తప్పింద న్నారు. బస్‌లో ప్రయాణిస్తున్న మహిళకు స్వల్పగాయాలు కాగా స్థానిక ఆసుపత్రికి తరలించారు.

రవాణాశాఖ కార్యాలయంలో దాడిచేసిన వ్యక్తి రిమాండ్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లారవాణాశాఖ కార్యాలయంలో ఇటీవల ఓ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన కేసులో పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన రౌతు నాగరాజును గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. సిరిసిల్లలో బూడిద లోడ్‌తో వెళుతున్న రెండులారీలను జిల్లా మోటారు వాహనాల తనిఖీ అధికారి వంశీధర్ తనిఖీ చేయగా అధిక లోడు ఉన్నదని కేసు పెట్టి బస్సు డిపోకి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న వాహనాల యజమాని మంగళవారం సాయంత్రం మద్యం తాగి వచ్చి రవాణాశాఖ కార్యాలయంలో ఫర్నీచర్ ధ్వంసంచేసి కార్యాలయ సిబ్బంది కానిస్టేబుల్ ప్రశాంత్‌ను గాయపరిచారనే ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి అరెస్ట్ చేశామని ఆయన తెలిపారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

ముత్తారం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖమ్మంపల్లి, అడవి శ్రీరాంపూర్, లక్కారం, ఓడేడు గ్రామాల్లో గుడుంబా స్థావరాలు నిర్వహిస్తున్నారని సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సారాతయారీకి ఉపయోగించే బెల్లం పానకం సుమారు 200లీటర్లవరకు ధ్వంసంచేశారు. తనిఖీలలో ఎక్సైజ్ఎస్ఐ సాయి కుమార్, సిబ్బందిరాజేందర్,రాజ్‌కుమార్,నిరంజన్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

మక్కల లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్ బోల్తా

- డ్రైవర్‌కు స్వల్పగాయాలు



బోల్తా పడిన ట్రాక్టర్

సుల్తానాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండల పరిషత్ సమీపంలోని మజీద్ ఎదురుగా ఉన్న రోడ్డులో మూలమలుపు వద్ద ఓ గొయ్యి ఏర్పడి నెలలు గడుస్తుంది. ఈ రోడ్డులో వెలుతున్న అనేక వాహనాలు గొయ్యి గమనించక ప్రమాదాల బారినపడ్డాయి. గురువారం కాల్వశ్రీరాంపూర్ నుంచి సుల్తానాబాద్‌కు మక్కల లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ గొయ్యిని గమనించక మూలమలుపు వద్ద నుంచి వస్తుండగా ట్రాక్టర్ గోతిలో పడి బోల్తాపడింది. డ్రైవర్ స్వల్పగాయాలతో బయట పడ్డాడు. ప్రాణాపాయం తప్పింది. నెలలు గడుస్తున్నా కూడా గొయ్యిని పూడ్చడమో కానీ మరమ్మతు చేయించడమో పట్టించుకోని అధికారుల పట్ల పలువురు నిరసన వ్యక్తం వ్యక్తం చేస్తున్నారు.

కుక్కదాడిలో పది మందికి గాయాలు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం సుందరయ్యనగర్‌లో గురువారం వీధికుక్క దాడిలో పదిమందికి గాయాలయ్యాయి. బాధితులు సుందరయ్యనగర్‌లోని అర్బన్ ఆసుపత్రికి వెళ్లగా వైద్యురాలు సాహితి చికిత్స చేసి వాక్సిన్ వేశారు. వెంటనే వైద్యురాలు మున్సిపల్అధికారులకు సమాచారం ఇచ్చారు.

కమ్మనైనది అమ్మ భాష



- భావ ప్రకటనకు మాతృభాషే కీలకం
- తొలిపలుకులు నేర్పేది అమ్మ భాషలోనే..
- నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

జగిత్యాల/కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మానవుడు పుట్టిన తర్వాత ఏ భాషైతే మాట్లాడుతాడో అదే అతడి మాతృ భాష. ఫిబ్రవరి 21ని అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవంగా జరుపుకోవాలని 1999 నవంబరు 17న యునెస్కో తీర్మానాన్ని ఆమోదిం చింది. ఈ దిశలో శుక్రవారం ప్రపంచ మాతృ భాషా దినోత్సవం జరుపుకుంటున్నాం. కృష్ణ దేవరాయలతో దేశ భాషలందు తెలుగు లెస్స అని, విదేశీయులతో ఇటాలియన్ ఆఫ్ అది ఈస్ట్ అని అనిపించుకున్నది తెలుగు భాషా మెకంజి, బ్రౌన్, మన్రో, హాల్డెన్ వంటి పాశ్చాత్య చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం సమన్వయశక్తి, విభిన్న ప్రవంతులను లీనం చేసుకునే సమర్థత తెలుగు భాషకే ఉంది.

- **ఆరు వేల భాషలు..**

ప్రపంచంలో మొత్తం ఆరు వేల భాషలుండగా భారత దేశంలో 1,652 మాతృ భాషలున్నాయన్న అంచనా ఉంది. వీటిలో 16 భాషలకు మాత్రమే లిపి ఉంది. 200 భాషలకు 1,600లకు పైగా మాండలికాలున్నాయి. మాతృభాష అంతరించి పోయే ప్రమాదాన్ని గమనించిన యునెస్కో ప్రజల జాతీయ, పౌర, రాజకీయ, సాంఘిక, ఆర్థిక సాంస్కృతిక హక్కుల్లో మాతృభాష అంతర్భాగమని నిర్వచించింది. దేశంలో 57 అక్షరాలు, 3 ఉభయ అక్షరాలు ఉన్న తెలుగు భాష ప్రపంచ భాషల్లోనే రెండో అతి పెద్ద మాతృ భాషగా మన్ననలు పొందుతోంది.

సంస్కృతికి మూలం..

మాతృ భాషను పరిరక్షించుకోవడమంటే మన సంస్కృతిని పరిరక్షించుకోవడమే. ఎన్నో సాహిత్య ప్రక్రియలు, సారళ్యం, స్పష్టత, సౌష్టవం, సౌందర్యం, సమన్వయం వంటి లక్షణాలు కలిగి భావ జాల వ్యాప్తికి పరస్పర సంభాషణానుకూలమై పల్లవిస్తోంది తెలుగు భాష. దేశంలో కొన్ని రాష్ట్రాల వారు మాతృ భాషకు పట్టం కడుతుంటే మనం మన భాషను మాట్లాడానికే ఇబ్బంది పడుతున్నాం. ఆంగ్లంపై మోజు పెంచుకున్న మనం తెలుగును సమున్నత రీతిలో గౌరవించలేకపోతున్నాం. తెలుగును అధికారిక భాషగా ఇప్పటికీ అమలు చేయలేక పోతున్నాం.



జాతీయ భాషగా తెలుగుకు అర్హత....
డాక్టర్ నలిమెల భాస్కర్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

జాతీయ భాషగా తెలుగుకున్న గొప్ప అర్హత మరే ఇతర భాషకు లేదు. తక్కువ సమయంలో నైపుణ్యాన్ని, విస్తృత జ్ఞానాన్ని పొందవచ్చు. ఇతర భాషలను సులువుగా నేర్చుకునే సౌలభ్యం మాతృ భాష ద్వారా సాధ్యం. లిపి సౌకర్యం, అజంత భాష కావడంతో గానానుకూలంగా ఉంటుంది.



భాషను బతికించుకుందాం..
డాక్టర్ గండ్ర లక్ష్మణ్‌రావు, సాహితీవేత్త

మాతృ భాషను బతికించుకోవాలి. ఎన్నో సాహిత్య ప్రక్రియలున్న తెలుగు భాషా ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పాలి. కార్యాలయాలు, విద్యాలయాల్లో, ఇంటా బయటా తెలుగులోనే మాట్లాడుతూ అన్ని వ్యవహారాలు జరిపితేనే మాతృ భాష మనుగడ సాధిస్తుంది.

ప్రభుత్వ వ్యవహారాలన్నీ ప్రజల భాషలో నడవాలి
అన్నవరం దేవేందర్, రచయిత

మాతృ భాషలో విద్యా బోధనతో పాటు ప్రభుత్వ వ్యవహారాలన్నీ ప్రజల భాషలో నడవాలి. అన్ని స్థాయిలో తెలుగును నిర్బంధంగా అమలు చేయాలి. మాండలికాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.



తెలుగు వెలుగులు పంచాలి..
కాండూరి వేంకటేశ్వర్లు, తెలుగు పండితుడు

తెలుగు వెలుగులు పంచాలి. విద్యార్థులకు మాతృభాషకు చెందిన అష్టావధానం, అంత్యాక్షరితో పాటు సామెతలు, లోకోక్తులు, నుడికారాలు, శతక పద్యాలు, నీతి కథలు, ప్రాచీన, ఆధునిక కవులు, రచయితలను పరిచయం చేయాలి.



మాతృభాషను ప్రోత్సహించాలి
డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, జగిత్యాల

అన్ని భాషలకంటే అమ్మ భాష కమ్మనైనది. మాతృ భాషలో విద్యా బోధన విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గిస్తోంది. బిడ్డకు అమ్మ పలుకే కమ్మగా ఉంటుంది. అందుకే అమ్మ భాష తీయగా ఉంటుంది. మాతృ భాషలోని పదనిసలు, భాషా సౌందర్యం చిన్నతనం నుంచే పరిచయం అవుతుంది. మాతృ భాషకు చెందిన కథల పుస్తకాలు, నవలలు, పురాణాలు, ఇతిహాసాలు వంటి వాటిని చదవడాన్ని ప్రోత్సహించాలి.



మాతృ భాషను కాపాడుకుందాం...
అయిత అనిత, కవయిత్రి, జగిత్యాల

మాతృ భాషను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. మాతృ భాషపై పట్టు సాధించిన వారు మిగితా భాషలను, విజ్ఞానాన్ని తొందరగా సముపార్జించగలరు. అమ్మను ఎంత ప్రేమగా, గౌరవంగా చూసుకుంటామో మాతృ భాషను అంతే ప్రాణంగా పరిగణించాలి. విద్యార్థులకు మాతృ భాష విశిష్టతను తెలియజేసే విధంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ, మాతృ భాష వినియోగాన్ని పెంచుతూ భావి తరాలకు మాతృ భాషను కానుకగా ఇద్దాము.



గోపాల్‌రావుపేటలో దొంగతనం

రామడుగు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన గోలి మధుసూదన్‌రెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. మధుసూదన్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఇంటికి తాళంవేసి బుధవారం బంధువుల ఇంటికివెళ్లారు. తాళం పగల గొట్టి ఇంటిలో ప్రవేశించి ప్రవేశించిన దొంగలు బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న 10తులాల బంగారు ఆభరణాలతో పాటు 2.84లక్షల రూపాయలు ఎత్తుకెళ్లారు.. గురువారం ఉదయం ఇంటికి వచ్చిన మధుసూదన్‌రెడ్డి కుటుంబ సభ్యులు తలుపులు తెరిచి ఉండడంతో దొంగతనం జరిగిందని గ్రహించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రామడుగు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మానకొండూర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్ది మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మానకొండూర్‌లో పట్టుకున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దుర్శేడ్ ప్రభుత్వ పాఠశాలలో క్షుద్ర పూజల కలకలం



ప్రధానోపాధ్యాయుడి గది ఎదుట ముగ్గు, నిమ్మకాయలు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో క్షుద్ర పూజల కలకలం రేపింది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ప్రధానోపాధ్యాయుని కార్యాలయం ఎదుట పసుపు, కుంకుమ, నిమ్మకాయలు ఉంచారు. గురువారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో విద్యార్థులు స్కూల్‌కు రావడంతో వాటిని చూసి భయందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని గ్రామస్థులకు, ఉపాధ్యాయులకు తెలిపారు. అయితే గ్రామంలో ఇటువంటి సంఘటనలు జరగడం సర్వసాధారణమే అని గ్రామస్థులు అంటున్నారు.. గతంలో కొందరు ఆకతాయిలు పాఠశాలలోని బెంచీలు, స్విచ్‌బోర్డులు విరగగొట్టిన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. పాఠశాల విద్యార్థులే ఈచర్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

గంజాయి రాకెట్‌ను ఛేదించిన పోలీసులు

- సీసీ కెమెరాల అమ్మకాల ముసుగులో దందా
- ఈ కామర్స్ ఏజెన్సీల ద్వారా డెలివరీ
- ఛత్తీస్‌గఢ్ నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న 96.7కిలోల గంజాయి పట్టివేత
- రెండు కేసుల్లో 1.2 క్వింటాళ్లు స్వాధీనం
- విలువ రూ.60లక్షలు, రెండు కేసుల్లో 15మంది అరెస్టు



నిందితుల అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో గంజాయి ఆనవాళ్లు లేకుండా చేయాలనే ప్రభుత్వ ఆదేశాలతో రామగుండం కమిషరేట్ టాస్క్‌ఫోర్స్ బృందాలు గంజాయి రవాణా, అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టాయి. పకడ్బందీ సమాచారంతో ఒకే రోజు మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో దాడులు నిర్వహించి 1.2క్వింటాళ్ల గంజాయిని పట్టుకున్నారు. 15 మంది నిందితులను అరెస్టు చేసి రెండు కార్లు, ఐదు మోటార్ సైకిళ్లు, 17సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం కమిషరేట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీశ్రీనివాస్ అరెస్టు వివరాలను వెల్లడించారు. మంచిర్యాల పట్టణంలోని ఎస్‌బీఐ కాంప్లెక్స్ సెల్లార్‌లో సోమ ప్రవీణ్ సీసీ కెమెరాల షాపు పేర గంజాయి అమ్మకాలుచేస్తున్నట్టు గుర్తించిన పోలీసులు దందాను గుట్టు రట్టు చేశారు. సోమ ప్రవీణ్, అతని స్నేహితుడు సతీష్, మరికొందరు సీలేరు నుంచి గంజాయి తీసుకువచ్చి సీసీ కెమెరాల గోడౌన్‌లో నిల్వ చేసేవారు. అనుమానం రాకుండా ప్యాక్‌చేసి ఈ కామర్స్ డెలివరీ ఏజెన్సీల ద్వారా కస్టమర్లకు పార్సిళ్ల రూపంలో చేరవేసేవారు. అనుమానం వచ్చిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు దీనిపై నిఘా పెట్టారు. గురువారం గోడౌన్‌పై టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. బాల నేరస్థుడితో పాటు 11మందిని అరెస్టు చేయగా మరో 11మంది పరారీలో ఉన్నారు. అప్పటికే సోమ ప్రవీణ్, రాజు అనే వ్యక్తులు బయటకు వెళ్లగా ఇరుగురాళ్ల సతీష్ కుమార్(34), మహ్మద్ సమీర్(19), భీమ అనుదీప్(21), మహ్మద్ అబ్దుల్ ఉబేద్(22), అర్జున్ బాబురావు చౌహన్(26), మహ్మద్ అజీజ్(19), జాడి రాఘవేంద్రస్వామి(23), గూడూరు రాము(20), ఎస్‌కే అతహర్(18), ఎస్‌కే సమీర్(25)లను పట్టుకున్నారు. ప్రధాన సూత్రదారి సోమ ప్రవీణ్, తగరపు రాజు, అతని భార్య శృతి, తరగపు వినయ్, రామారపు రాకేష్, శ్రీధర్, మున్ని, ఆల్ మేకర్ శ్యామ్, క్వార్టర్ సాయి, సోహెల్, చింటు పరారీలో ఉన్నారు. వీరివద్ద నుంచి 23.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 11ఫోన్లు, ఐదు బైక్‌లు, ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్లు సీజ్ చేశారు.

గోదావరిఖని టుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 11ఏ క్రాస్‌వద్ద గురువారం ఛత్తీస్‌గఢ్ నుంచి గంజాయిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు గురువారం కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, టుటౌన్ పోలీసులు తనిఖీలు జరిపారు. మహారాష్ట్రకు వెళుతున్న రెండు కార్లను తనిఖీ చేయగా కారు డిక్కీ కింది భాగంలో ప్రత్యేక బాక్స్‌లు ఏర్పాటు చేసి రవాణా చేస్తున్న గంజాయిని పట్టుకున్నారు. 96.7 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఉదయ్ వీర్(32), ఒడిశాకు చెందిన కేశవ్ కర, సోమనాథ్ కర, రాజస్థాన్‌కు చెందిన రాజు లోధి సంజు ఒక ముఠాగా ఏర్పడి గంజాయి రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. ఈ నలుగురిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు సూరజ్, అర్జున్ బోరిలు పరారీలో ఉన్నట్టు సీపీ తెలిపారు. రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రెండు కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న 1.2 క్వింటాళ్ల గంజాయి విలువ మార్కెట్‌లో రూ.60లక్షలు ఉంటుందని సీపీ శ్రీనివాస్ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. పట్టుబడిన నిందితులపై పీడీ యాక్టు నమోదు చేయడమే కాకుండా, వారి ఆస్తులను జప్తు చేస్తామని సీపీ హెచ్చరించారు. గంజాయిని పట్టుకోవడంలో కృషిచేసిన ఎస్‌బీ, టాస్క్‌ఫోర్స్, మంచిర్యాల, గోదావరిఖని టుటౌన్‌పోలీసులను సీపీ అభినందించారు.

విలేకరుల సమావేశంలో పెద్దపల్లి డీసీపీ చేతన, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, మంచిర్యాల సీఐ ప్రమోద్‌రావు, టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్, టుటౌన్ సీఐ ప్రసాద్‌రావు, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు: సీపీ



ఇసుక క్వారీ వద్ద వివరాలు అడిగి తెలుసుకుంటున్న రామగుండం సీపీ శ్రీనివాస్

ముత్తారం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని, అక్రమరవాణాను అరికట్టాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఖమ్మంపల్లి, జిల్లాలపల్లిలోని ఇసుక క్వారీలను సీపీ తనిఖీచేశారు. క్వారీ సందర్శించిన అనంతరం ప్రధానంగా రవాణదారులు ఇసుకను అక్రమంగా తరలించే మార్గాలను తెలుసుకున్నారు. వాహనాల వేబిల్స్, లోడ్ పరిమితిని పరిశీలించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తరలించే వారి సమాచారాన్ని అందుబాటులో ఉంచుకోవాలని, వారి కార్యకలాపాలపై దృష్టిపెట్టాలని అధికారులకు సూచించారు. తనిఖీలు జరిపే సమయంలో సిబ్బంది తప్పని సరిగా తనిఖీచేసిన వాహనవివరాలు నమోదు చేయాలని, ఇసుక తరలించే వాహనాల ధ్రువపత్రాలు ఉన్నాయే లేవో పరిశీలించాలన్నారు. ఇసుక రవాణా వాహనాలపై నిఘా పెట్టాలని, ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేవిధంగా ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతితో నడుస్తున్న రీచ్‌లనుంచి ఇసుకను తరలించే విధానాన్ని సీపీ పరిశీలించారు. పెద్దపల్లి డీసీపీచేతన, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర, గోదావరిఖని ఏసీపీ రమేష్, మంథని సీఐ రాజు, ముత్తారం ఎస్ఐ నరేష్ ఉన్నారు.

రెవెన్యూ శాఖలో ఏసీబీ కలకలం..

- ఏసీబీకి చిక్కిన సర్వేయర్
- ల్యాండ్ సర్వేకు రూ. 17 వేలు డిమాండ్,
- ఏసీబీని ఆశ్రయించిన ప్రైవేట్ ఉద్యోగి
- రూ.3 వేలు లంచం తీసుకుంటూ అధికారులకు చిక్కిన వైనం

మంథని, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మంథని రెవెన్యూశాఖలో పనిచేస్తున్న అవినీతి ఉద్యోగిని ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. స్థానిక బస్టాండ్ సమీపంలో గురువారం సాయంత్రంలంచం తీసుకుంటూ ల్యాండ్ సర్వేయర్ జాటోతు గణేష్ ఏసీబీకి పట్టుబడ్డాడు. మంథనికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి సువర్ణ క్రాంతినాగ్ వద్ద రూ.3 వేలు లంచం తీసుకోగా ఏసీబీ డీఎస్పీ వీవీ రమణ మూర్తి, సీఐలు కృష్ణకుమార్, తిరుపతిలు దాడిచేసి ల్యాండ్‌సర్వేయర్ గణేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లి విచారించారు. మంథని మున్సిపాలిటీ పరిధి గంగాపురి సమీపంలోని వ్యవసాయ భూమిని సర్వే చేయటానికి ల్యాండ్ సర్వేయర్ గణేష్ రూ. 17 వేలు డిమాండ్ చేశాడు. క్రాంతి తొలుత ఈనెల5న రూ.9వేలు సర్వేయర్‌కు ఇచ్చి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. గురువారం మరో రూ.3వేలు లంచం తీసుకుంటుండగా సర్వేయర్ గణేష్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈమేరకు సర్వేయర్ గణేష్ పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'సిటీ కాలేజ్ మక్దూమ్ మొహియుద్దీన్ నేషనల్ అవార్డు'కు 'నలిమెల' ఎంపిక


డాక్టర్ నలిమెల భాస్కర్

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన బహుభాషావేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుగ్రహీత, అనువాదకుడు, రచయిత డాక్టర్ నలిమెల భాస్కర్‌కు ప్రతిష్ఠాత్మక 'సిటీకాలేజ్ మక్దూమ్ మొహియుద్దీన్ నేషనల్‌అవార్డు' ప్రకటించారు. ఈమేరకు హైదరాబాద్‌కు చెందిన ప్రభుత్వ సిటీ కాలేజ్ ప్రిన్సిపల్ ఆచార్య పి బాలభాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల24న ఉదయం 10-30గంటలకు ప్రభుత్వ సిటీ కళాశాల, గ్రేట్‌హాల్‌లో పురస్కారం ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుగొండ నిత్యానందరావు, అతిథులుగా మన తెలంగాణ దినపత్రిక సంపాదకుడు దేవులపల్లి అమర్, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు డాక్టర్ యాకూబ్, రచయిత అన్నవరం దేవేందర్ పాల్గొంటారని తెలిపారు. సమావేశాన్ని కళాశాల ఆచార్యులు డాక్టర్ విష్ణుదత్ శుక్లా, డాక్టర్ ఏలూరు యాదయ్య, డాక్టర్ కోయి కోటేశ్వరరావు సమన్వయం చేయనున్నారని తెలిపారు.

మహాశివరాత్రికి ఉత్సవ కమిటీ ఏర్పాటు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- 29 మందితో 5 రోజులు కొనసాగనున్న కమిటీ

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు ఉత్సవ కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులను విడుదల చేసింది. 29మంది సభ్యులతో ఐదు రోజుల పదవి కాలంతో పూర్తి వివరాలతో కూడిన ఉత్తర్వులను దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ విడుదల చేశారు. ఈనెల 23వ తేది నుంచి 28వ తేదివరకు ఉత్సవ కమిటీ పదవీబాధ్యతలు చేపడుతారని పేర్కొన్నారు. కమిటీ ఏర్పాటుకు కృషి చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఉత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు అనుముల చంద్రం, వడ్డెపల్లి వెంకటరమణ, కే. రాజిరెడ్డి, సి. విజయలక్ష్మీ, సాగరం వెంకటస్వామి, పాత సత్యలక్ష్మీ, కూరగాయాల కొమురయ్య, సంద్రగిరి శ్రీనివాస్, నాంపల్లి శ్రీనివాస్, పులి రాంబాబు, తూము సంతోష్, వకుళభరణం శ్రీనివాస్, పిల్లి కనుకయ్య, సంఘ స్వామి యాదవ్, జగన్మోహన్‌రెడ్డి, చేపూరి గంగయ, చింతపంటి రామస్వామి, కాయతి నాగరాజు,తొట్ల అంజయ్య, ఏనుగు రమేష్‌రెడ్డి, సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, ధర్న మల్లేశం, ఒలిమినేని నిత్యానందరావు, గొట్టె ప్రభాకర్, బుస్సా దశరథం, తాటికొండ పవన్, ముప్పిడి శ్రీధర్, సుగూరి లక్ష్మీ, తోట లహరిలతో కమిటీని ఏర్పాటు చేశారు.

'మహాశివరాత్రి'కి రావాలని దేవాదాయశాఖ మంత్రికి ఆహ్వానం


దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు రావాల్సిందిగా రాజన్నఆలయ ఈవో వినోద్‌రెడ్డి దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖను ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో గురువారం కలిసి మహాశివరాత్రి ఆహ్వాన పత్రికను అందజేయగా, ఆలయఅర్చకులు వేదోక్త ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. కాగా రెవెన్యూ ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్, సీఎం సలహాదారు శ్రీనివాసరాజు, లాసెక్రెటరీ తిరుపతిరెడ్డిలకు మహాశివరాత్రి జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు.

రాజన్న భక్తులకు అందుబాటులో హెల్ప్‌లైన్ నంబర్లు..

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి జాతరకువచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కలెక్టర్, ఎస్పీలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నిత్యం ఆలయంలో చేపట్టే జాతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పలువురు అధికారుల హెల్ప్‌లైన్ నంబర్లను భక్తులకు అందుబాటులో ఉంచారు. వేములవాడ రెవెన్యూ డివిజనల్ అధికారి 7032675222, వేములవాడ ఏఎస్పీ 8712656412, రాజన్న ఆలయ ఈవో 9491000743, తహసీల్దార్ 7337234446, టౌన్‌సీఐ 8712656413, వైద్యాధికారి9440078901, మున్సిపల్‌కమిషనర్ 8008578959, స్టేషన్ ఫైర్‌ఆఫీసర్ 8712699261, ప్రోటోకాల్‌ఆఫీస్ 08723-236040 నంబర్లను సంప్రదించాల్సిందిగా ఆలయ ఈవో కోరారు.

రంగు మారిన 'రాజన్న' ధర్మగుండం నీరు

- దుర్వాసన వస్తోందని వాపోతున్న భక్తులు
- ఎప్పటికప్పుడు శుద్ధి చేయాలని డిమాండ్

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి క్షేత్రంలో ఈనెల 25 నుంచి 27 వరకు మహాశివరాత్రి జాతర నిర్వహించనున్నారు. వారం రోజుల ముందు నుంచే రాజన్న ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. నిత్యం వేల సంఖ్యలో భక్తులు రాజన్న ఆలయానికి వస్తున్నారు. వచ్చిన భక్తులు ముందుగా ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని రాజన్నకు మొక్కులు చెల్లించుకుంటారు. అయితే ధర్మగుండంలోని నీరు రంగుమారి దుర్వాసన వెదజల్లుతోందని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు నీటిని శుద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.


రంగుమారిన ధర్మగుండంలోని నీరు



పని చేయని స్నానాల నల్లాలు..

ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించిన భక్తులు పక్కనే స్నానాలు చేసేందుకు ఆలయాధికారుల నల్లాలను ఏర్పాటు చేశారు. అయితే కొంతకాలంగా నల్లాలు పని చేయకపోవడంతో భక్తులు ధర్మగుండంలోనే స్నానాలు చేస్తున్నారు. శివరాత్రి జాతర సందర్భంగా భక్తుల తాకిడి పెరగడంతో నల్లాలను కూడా బాగు చేయించి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

ధర్మగుండంలో నీటిని ఎప్పటికప్పుడు శుద్ధి చేయాలి
మేర్గు లక్ష్మణ్, నాంపల్లి



మహాశివరాత్రి జాతర సందర్భంగా నిత్యం 30వేల నుంచి 50 వేల వరకు భక్తులు రాజన్న దర్శనానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో ధర్మగుండంలోని నీరు రంగు మారి దుర్వాసన వస్తోంది. ఎప్పటికప్పుడు నీటిని శుద్ధి చేసి భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి. ధర్మగుండం పక్కన ఉన్న నల్లాలను సైతం ప్రారంభిస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.

నీటి నాణ్యతను నిత్యం పరిశీలిస్తున్నాం..
వినోద్‌రెడ్డి, రాజన్న ఆలయ ఈవో



మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వేల సంఖ్యలో భక్తులు వస్తున్న క్రమంలో సంబంధిత మెడికల్, హెల్త్ అధికారులతో నిత్యం నీటి నాణ్యతను టెస్ట్ చేయిస్తున్నాం. సంబంధిత అధికారులు సూచనలు చేసిన వెంటనే నీటిని శుద్ధి చేస్తున్నాం. ఎప్పటికప్పుడు నీటిని శుద్ధి చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్న తపాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీపోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పావని, వ్యాయామఉపాధ్యాయుడు సాన బాబు పేర్కొన్నారు. ఇటీవల గాలిపెల్లిలో జరిగిన జిల్లాస్థాయి సబ్‌జూనియర్స్ పోటీలలో బాలుర విభాగంలో సుదగోని అఖిల్, బుర్ర హర్షవర్ధన్, బాలికల విభాగంలో కెశవేని అన్విత, ఎంద్ర సంజనలు ఉత్తమ ప్రదర్శన కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల21నుంచి వికారాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈసందర్భంగా పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. వీరిలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ బట్టు పద్మశ్రీనివాస్, ఈతరం యువజన సంఘ అధ్య క్షుడు గోవికారి నరేష్, కార్యదర్శి ఎంద్ర చింటులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

బెంగుళూరుకు బస్సు చార్జీలో రాయితీ

భగత్‌నగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బెంగుళూరుకు వెళ్లే బస్సు చార్జీలో పది శాతం రాయితీ ఇస్తున్నట్లు కరీంనగర్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, గోదావరిఖని డిపోల నుంచి బెంగుళూరుకు వెళ్లే బస్సు సర్వీసులలో బెంగుళూరు వరకు ప్రయాణించే ప్రయాణికులకు పదిశాతం రాయితీ కల్పిస్తు న్నట్లు తెలిపారు. ఈ బస్సుల్లో బెంగుళూరు వరకు ప్రయాణించే ప్రయాణికులు పదిశాతం రాయితీసౌకర్యం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫిరాయింపులపై బీఆర్ఎస్ మాట్లాడడం విడ్డూరం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఫిరాయింపులపై బీఆర్ఎస్ మాట్లాడడం విడ్డూరంగా ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమ్యునిస్టులపై కేసీఆర్ మాట్లాడడం తగదన్నారు. మునుగోడు ఎన్నికల్లో కమ్యునిస్టులు లేకుంటే బీఆర్ఎస్ అభ్యర్థి గెలిచేవాడా ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. మేడిగడ్డపై జ్యూడిషియల్ విచారణ జరుగుతున్న నేపథ్యంలో రాజలింగు హత్యకు గురికావడంపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్రవిచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా జాతీయ ఎన్నికల కమిషన్‌ను నియమించడం బీజేపీ ప్రభుత్వానికి తగదని కోర్టు జడ్జిమెంట్ ఇవ్వకముందే ఎన్నికల కమిషన్‌ను ఎలా నియమిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జాతీయ ఎన్నికల కమిషన్ నియామకంపై బీజేపీ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడం తగదన్నారు. దేశంలో అనేకమంది ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రభుత్వంలోకీలకంగా వ్యవహరిస్తున్న వారు నేరారోపణలు ఎదుర్కొంటున్నారని వారిపై ఏళ్ల తరబడి విచారణ జరగకుండా త్వరితగతిన పూర్తి చేయా లని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణనను స్వాగతిస్తున్నామన్నారు. ఇదే తరహాలో దేశ వ్యాప్తంగా కులగనణ జరగలన్నారు. గత శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో సీపీఐఎన్నికల అవగాహన చేసుకుని నేటికీఅది కొనసాగుతోందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి గెలుపుకోసం ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు, బామండ్లపల్లి యుగేందర్, న్యాలపట్లరాజు, బోనగిరి మహేందర్, నాయకులు మామిడిపల్లి హేమంత్‌కుమార్, ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒక్క బోరు.. 16 కనెక్షన్లు


బోర్‌కు బిగించిన నల్లా పైపులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని 2వ వార్డులో సుమారు 20 కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామ పంచాయతీ చేతి పంపు ద్వారా నీరు అందకపోవడంతో ఆ కాలనీవాసులు మూడేళ్ల కిందట కలిసి డబ్బులు పోగు చేసుకుని బోరు వేయించుకున్నారు. ఒకే బోరుకు 16 కనెక్షన్లు ఇచ్చి నీటి సమస్యను అధిగమిస్తున్నారు. బోరు మోటారు, స్టార్టర్ కాలిపోతే మరమ్మతులకు అయ్యే ఖర్చులను ఇంటింటా డబ్బులు జమ చేస్తూ చెల్లిస్తున్నారు. బోరు మోటారుకు మాత్రం గ్రామ పంచాయతీ విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. విద్యుత్ సరఫరా లేనిపక్షంలో తమకు నీటికి ఇబ్బందులు తప్పడం లేవని కాలనీవాసులు పేర్కొంటున్నారు. మిషన్ భగీరథ అసంపూర్తిగా వదిలేశారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ కాలనీకి భగీరథ నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉడకని అన్నం.. కుళ్లిన కూరగాయలు..

- కేజీబీవీని తనిఖీ చేసిన తహసీల్దార్
- సిబ్బందిపై ఆగ్రహం


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మారుతిరెడ్డి

వీర్నపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉడకని అన్నం.. కుళ్లిపోయిన కూరగాయలు చూసి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం సిబ్బందిపై స్థానిక తహసీల్దార్ మారుతిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను మధ్యాహ్నబోజన సమయంలో గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా అన్నం, కూరలను పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజన మెనూ ఏంటని సిబ్బందిని ప్రశ్నించగా ఎవరు సమాధానం ఇవ్వలేదు. విద్యార్థులకు మెనూప్రకారం భోజనం ఎందుకు అందించడం లేదన్నారు. పాఠశాలలో సరైనబోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడగగా వారం రోజులుగా అన్నం ఉడకడం లేదని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఉదయం పూట టిఫిన్ అందించేందుకు నెలరోజులుగా గ్రైండింగ్ మిక్సీ చెడిపోయినా సరిచేయలేదన్నారు. అనంతరం అక్కడే ఉన్న స్టోర్‌రూమ్‌ను పరిశీలించగా బూజుపట్టిన క్యారెట్‌లు, కుళ్లిపోయిన టమాటాలు, ఆలుగడ్డలు కనిపించడంతో వాటిని వెంటనే అక్కడి నుంచి తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాల ఆవరణలో కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు.

ప్రత్యేక అధికారి లేక పర్యవేక్షణ కరువై..

కేజీబీవీ పాఠశాలలో నెలరోజులుగా ప్రత్యేక అధికారి లేకపోవడంతో పాఠశాలలో పర్యవేక్షణ కరువైంది. ఇక్కడ పనిచేసిన ప్రత్యేక అధికారి పద్మ మర్రిపల్లి కేజీబీవీ పాఠశాలకు బదిలీకాగా, అక్కడి ప్రత్యేక అధికారి శకుంతల ఈపాఠశాలకు రావాల్సిఉండగా ఇప్పటివరకు జాయిన్‌కాలేదు. ఉన్నసిబ్బంది ఎవరికివారే ఇష్టానురీతిగా వ్యవహరించడంతో విద్యార్థులకు కష్టాలు తప్పడంలేదు. రెగ్యులర్‌స్టాఫ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ హాజరు రికార్డులను తహసీల్దార్ పరిశీలించగా మధ్యమధ్యలో కొంతమంది సంతకం చేయకుండా ఖాళీగా ఉండడం గమనించారు. రిజిస్టర్‌లో ఖాళీలు ఎందుకు ఉన్నాయని తహసీల్దార్ ప్రశ్నించగా సంతకాలు చేయడం మర్చిపోయారని సమాధానమిచ్చారు. ఇలాంటి పొరపాట్లు మరలా కనిపించద్దని తహసీల్దార్ హెచ్చరించారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, జడ్పీహెచ్ఎస్ పీడీ చామంతి, పాఠశాల ఇన్‌చార్జిలు పద్మ, మమత ఉన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్ ఫలితాలు విడుదల

గణేష్‌నగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన హోటల్ మేనేజ్‌మెంట్ 1,3,5 సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ రంగప్రసాద్ విడుదల చేశారు. ఈ ఫలితాలు www.satavahana.ac.in వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

విద్యుత్ సమస్యలుంటే అధికారులకు తెలియజేయాలి

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలుంటే అధికారులకు తెలియజేయాలని టెక్నికల్ డీఈ ఉపేందర్ అన్నారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పొలంబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిన్న పాపయ్యపల్లి గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు విద్యుత్‌కు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. రైతులు తడిచేతులతో స్టార్టర్‌బాక్సులు ముట్టుకోకూడదన్నారు. ఐరన్‌బాక్సులు ఉంటే తక్షణమే తొలగించి ప్లాస్టిక్‌స్టార్టర్ బాక్సులను పెట్టుకోవాలన్నారు. విద్యుత్తు సమస్యలుంటే నేరుగా అధికారులకు తెలియజేయాలన్నారు. లేనిపక్షంలో 1912నంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈ సంతోష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.


చిన్నపాపయ్యపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న టెక్నికల్ డీఈ ఉపేందర్

జాతీయస్థాయి యోగా పోటీల్లో ఐదో స్థానం



జాతీయ యోగాసన వేదికపై ప్రశంసాపత్రం అందుకుంటున్న ఆమని

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రంలో ఈనెల19న జరిగిన 49వ జాతీయస్థాయి యోగాసనపోటీల్లో ఉమ్మడికరీంనగర్ జిల్లాకు చెందిన జాపతి ఆమని ప్రతిభ చాటింది. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన ఆమని 25-30సంవత్సరాల వయస్సు కేటగిరీలో తెలంగాణ రాష్ట్ర జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించి ఐదవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఆమనిని తెలంగాణ రాష్ట్రయోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, ఉపాధ్యక్షుడు కన్నకృష్ణ, యోగాకోచ్‌లు కిష్టయ్య, రామకృష్ణ, మల్లీశ్వరి అభినందించారు.

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి

- సోషల్ మీడియా దుష్ప్రచారాన్ని, కుట్రలను తిప్పికొట్టాలి
- అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలి
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, సోషల్‌మీడియా దుష్ప్రచారం, కుట్రలను తిప్పికొట్టాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్లశ్రీధర్‌బాబు పార్టీశ్రేణులకు సూచించారు. గురువారం కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి మంత్రి శ్రీదర్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఎమ్మెల్సీఎన్నికల్లో నరేందర్‌రెడ్డి విజయం కోసం కృషిచేయాలని పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో బీజేపీ, బీఆర్ఎస్‌తోపాటు కొంతమంది నరేందర్‌రెడ్డికి వ్యతిరేకంగా చేస్తున్న దుష్ప్రచారాలను, ప్రభుత్వంపై ఇతరపార్టీలు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లకు గ్రూప్-1 పరీక్ష నిర్వహించిన ఘనత కాంగ్రెస్ పార్టీదని, ఏ రాష్ట్రంలో లేనివిధంగా 56వేలఉద్యోగాలు కల్పించామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులకు 20వ తేదీ వరకు జీతాలు చెల్లించలేదని, తమ ప్రభుత్వం వచ్చాక మొదటి వారంలోనే జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని శ్రీధర్‌బాబు విమర్శించారు. అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి కాంగ్రెస్‌అభ్యర్థిగా గెలిపించాలని, ఆయన గెలుపు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కీలకమన్నారు. కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా గెలిచేందుకు ప్రతిఒక్కరూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్‌రెడ్డి విజయంకోసం కృషిచేయాలని శ్రీదర్‌బాబు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యర్థులు తనను ఎదుర్కోలుగా కోట్లు ఖర్చు పెడుతూ సోషల్ మీడియాలో తనపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ శ్రేణులంతా ఈ ప్రచారాన్ని తిప్పికొట్టి తనవిజయానికి కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన అద్భుతంగా సాగుతోందని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశ్, కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, అసెంబ్లీ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ప్రణవ్‌బాబు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలి

- జీవనజ్యోతి, వైద్యాధికారి, ఇల్లంతకుంట



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : ఎండల తీవ్రత పెరుగుతున్నందున ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

వైద్యాధికారి: ద్రవప దార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. వడదెబ్బకు గురయితే వెంటనే వైద్యసిబ్బందిని సంప్రదించాలి. వడదెబ్బ లక్షణాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీలు ఎన్ని ఉన్నాయి. మందులు అందుబాటులో ఉన్నాయా?

వైద్యాధికారి: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో 4 ఖాళీలు ఉండగా, అత్యవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: పోషక ఆహారలోపం ఉన్నవారు ఎలాంటి ఆహారాన్ని తీసుకోవాలి?

వైద్యాధికారి: పోషక ఆహారలోపం ఉన్నవారు ప్రొటీన్స్, ఫ్యాట్స్ కార్బోహైడ్రేట్, మినరల్స్ సరైనమోతాదులో తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారు.

ఆంధ్రజ్యోతి: సీజనల్‌వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

వైద్యాధికారి : అన్ని గ్రామాలలో ఆశాకార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీచేశాం. పరిశుభ్రమైన నీటిని తాగాలని అవగాహన కల్పిస్తున్నాం.

- ఇల్లంతకుంట (ఆంధ్రజ్యోతి)

నిరుద్యోగులను మోసం చేసిన బీజేపీ

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం కోట్లల్లో ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను నమ్మించి బీజేపీ మోసం చేసిందని, ప్రభుత్వ రంగంలో ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టడానికి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్న బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించి లౌకిక శక్తులను బల పరచాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్‌బాబు పిలుపునిచ్చారు. సిరిసిల్ల పట్టణం బివై నగర్‌లోని అమృత్ లాల్ శుక్లా భవనంలో జరిగిన సీపీఎం జిల్లా స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. కేంద్ర బీజేపీ సర్కార్ 11 ఏళ్ల కాలంలో కరీంనగర్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గం పరిధిలో ఒక్క నిరుద్యోగికైనా కేంద్ర ప్రభుత్వం నుంచి ఉద్యోగం కల్పించిందా అని ప్రశ్నించారు. బీజేపీ అభ్యర్థి పోటీలో పెట్టిన కేంద్ర మంత్రి బండి సంజయ్ మత విద్వేషాలు రెచ్చగొట్టడం తప్ప నిరుద్యోగ సమస్యపై పార్లమెంటులో ఏనాడైనా ప్రస్తావించారా అని ప్రశ్నించారు తమ రాజకీయ పబ్బం గడుపుతున్న బీజేపీని ఓడించకపోతే తెలంగాణ రాష్ట్రాన్ని వల్లకాడులాగా మార్చే ప్రమాదం ఉందన్నారు. నిత్యం మత కొట్లాటలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. ఉపాధి అవకాశాలు, ఖాళీ పోస్టుల భర్తీవంటి సమస్యలు ఏనాడూ బీజేపీకి పట్టలేదన్నారు సీపీఎం నిరుద్యోగుల తరఫున నిరంతరం పోరాడుతుందన్నారు సామాజిక శక్తులు నేటి యువతరం తెలంగాణ రాష్ట్రాన్ని ప్రశాంత వాతావరణంలో చూడాలంటే బీజేపీ ఓడించాలన్నారు. సీపీఎం సెక్యులర్ శక్తుల ఐక్యత కోసం కృషి చేస్తుందని, మతసామరస్యం వైపు అడుగులు వేస్తుందన్నారు. సిరిసిల్ల జిల్లాలో అసైన్డ్ భూములు ప్రభుత్వానికి అప్పగించిన వాటిని తక్షణమే పేదలకు ఇండ్ల స్థలాల కోసం ప్లాట్లుగా చేసి అర్హులైన నిరుపేదలందరికి ఇండ్లస్థలాలు ఇవ్వాలని స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోడం రమణ జిల్లా కమిటీ సభ్యులు గన్నేరం నర్సయ్య ఎర్రవెల్లి నాగరాజు సూరం పద్మ అన్నల్దాస్ గణేష్ గురిజాల శ్రీధర్ మల్లారపు ప్రశాంత్ ఎలిగేటి రాజశేఖర్ శ్రీరాముల రమేష్ చంద్ర శాఖా కార్యదర్శులు సిరిమల్లె సత్యం నక్క దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు

కన్నుల పండువగా పెద్దమ్మ- పెద్దిరాజుల కల్యాణ మహోత్సవం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం కొలనూరు గ్రామంలో పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణ మహోత్సవము ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పెద్దమ్మ తల్లి దీవెనలతో ప్రజలందరూ బాగుండాలని కోరారు. ఈ మహోత్సవములో కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయలు ఎల్లయ్య, మండల అధ్యక్షుడు పాషాతో పాటు ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కాగా, ముదిరాజుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి జాతర గురువారం అత్యంత వైభవంగా జరి గింది. బీఆర్‌ఎస్ నేత చల్మెడ లక్ష్మీనరసింహారావు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్ర మంలో సింగిల్ విండో చైర్మన్ రామ్మోహన్‌రావు, నాయకులు రాఘవరెడ్డి, మామిండ్ల, అంజయ్య, దేవయ్య, తాళ్లపల్లి సతీష్, అరవింద్, మహేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

గులాబీ శ్రేణుల్లో అసంతృప్తి..

(5వ పేజీ తరువాయి)

నర్సింహస్వామి,మహేందర్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, శ్రీకాంత్ సుహాసినిలు పోటీలో ఉండి ప్రచారం ప్రారంభించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ పట్టభద్రుల అభ్యర్థులు పోటాపోటీగా జిల్లాలో ప్రచారం చేస్తున్నారు. కానీ గులాబీ క్యాడర్ మాత్రం అయోమయంలో ఉండిపోయింది. పార్టీ విధానం ఏమిటో స్పష్టత లేకపోడం, ఏ పార్టీకి ఏ సంఘానికి మద్దతును ఇవ్వాలనే దానిపై అధిష్టానం నుంచి ఎలాంటి ప్రకటనలు రాకపోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మరోవైపు బీఆర్‌ఎస్‌కు ఉన్న రాజకీయ పరిస్థితులను బేరీజు వేసుకుంటున్న ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థులు ఆ పార్టీ మద్దతు కోసం ప్రయత్నం చేయడం లేదని తెలుస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరం కావడంపై బీఆర్‌ఎస్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేయడమే కాకుండా స్థానిక ఎన్నికలపై ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ క్యాడర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జోష్ చూపుతుంటే, బీఆర్‌ఎస్ నాయకులు నిరాశ పడక తప్పడం లేదు.

బీఆర్‌ఎస్ క్యాడర్ ఏటు వైపు..

మెదక్, కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాల్లోనూ బీఆర్‌ఎస్ అభ్యర్థులను నిలపకపోవడంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆ పార్టీ క్యాడర్ ఏటు వైపు నిలుస్తుందనే చర్చ జరుగుతోంది. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ రవీందర్‌సింగ్ పట్టభద్రుల ఎమ్మెల్సీలో బీఆర్‌ఎస్ టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నం చేసి చివరకు ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా పోటీలో దిగారు. ఆయనకు బీఆర్‌ఎస్ మద్దతు ఇచ్చే పరిస్థితి లేదు. దీంతో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా మద్దతు ఇస్తారా..? అధికారంలో కాంగ్రెస్ ఉండడంతో అటు వైపు మొగ్గు చూపుతారా..? అనే చర్చ జరుగుతోంది. వేములవాడ శాసనసభ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్, సిరిసిల్ల నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ క్యాడర్ బలంగా ఉంది. ఇందులో సిరిసిల్ల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు కేటీఆర్ ఉండడంతో జిల్లా నుంచి బీఆర్‌ఎస్ నాయకులు అధిష్టానం ఏ ప్రకటన చేస్తుందోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఉపాధ్యాయులు, పట్టభద్రులు, తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన వారు ఉన్నారు. బీఆర్‌ఎస్, కేసీఆర్, కేటీఆర్ అంటే అభిమానంతో ఉన్నవారు ఉన్నారు. బీఆర్‌ఎస్ అభిమానులు, కార్యకర్తల్లోనూ పట్టభద్రులు ఉన్నారు. వీరు ఎటువైపు నిలవాలనే సందిగ్ధంతో ఉన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఇండిపెండెంట్‌లకు మద్దతు ప్రకటన చేయలేదు. ఈ క్రమంలో కాంగ్రెస్‌పై ప్రతీకారం తీర్చుకునే దిశగా జిల్లాలో బీజేపీ, బీఎస్పీ వైపు పట్టభద్రులు మొగ్గు చూపుతారని తీవ్రంగా చర్చ జరుగుతోంది.

జోరుగా ప్రచారం...

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం గడువు దగ్గర పడుతుండడంతో అభ్యర్థులు జోరు పెంచారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఓటర్ల మద్దతును కూడగట్టుకునే దిశగా సోషల్‌మీడియా, ఉదయం మార్నింగ్ వాక్, డిజిటల్ స్క్రీన్‌లతో ప్రచారం చేస్తున్నారు. ఈనెల 27న పోలింగ్ ఉండడంతో ప్రచార వేగాన్ని పెంచారు. కాంగ్రెస్, బీజేపీకి చెందిన నాయకులు పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి వారి వివరాలను కూడా సేకరిస్తున్నారు. జిల్లాలో గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సంబంధించి 23,347 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లు 22,397 మంది ఉండగా, పురుషులు 13,772 మంది, మహిళలు 8,625 మంది ఉన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్లు 950 మంది ఉండగా, పురుషులు 677 మంది, మహిళలు 273 మంది ఉన్నారు. గత ఎన్నికల కంటే ఓటర్ల సంఖ్య పెరిగింది. 2019 ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ 10,584 మంది ఉండగా, పురుషులు 7,390, మహిళలు 3,192 మంది ఉన్నారు. టీచర్లకు సంబంధించి 783 మంది ఉండగా, పురుషులు 600, మహిళలు 183 మంది ఉన్నారు. గత ఎన్నికల కంటే 12,147 ఓట్లు పెరిగాయి. ఇందులో గ్రాడ్యుయేట్లు 11,980 మంది, టీచర్లలో 167 మంది పెరిగారు.

హామీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ముదిరాజ్

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ఎన్నికలల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓట్లతో బుద్ధి చెప్పాలని రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ముదిరాజ్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని అంకారపు ఫంక్షన్ హాల్‌లో గురువారం సిరిసిల్ల నియోజకవర్గ స్థాయి సమావేశానికి హాజరైన జిల్లా నూతన అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ముదిరాజ్‌తో పాటు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియామకమైన మ్యాన రాంప్రసాద్‌లను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ప్రజలకు ఆరుగ్యారంటీలను అమలు చేయడంతోపాటు యువతను ఆదుకుంటామని హామీలను ఇచ్చి మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నిరుద్యోగులు, యువత కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఉద్యోగులకు ఇప్పటివరకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని ఇవ్వన్ని ఇవ్వడంతోపాటు ఎన్నికల హామీలను అమలుచేసిన తర్వాతనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు అడుగాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విద్యార్థులకు రావాల్సిన రూ 7500 కోట్లను ఇప్పించిన తర్వాతనే ఓట్లను అడుగాలన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ అడెపు రవీందర్, సిరిసిల్ల నియోజకవర్గ కన్వీనర్ కారెడ్ల మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బర్కం వెంకటలక్ష్మీ, నాయకులు గోపాడి సురేందర్‌రావు, వెన్నమనేని శ్రీధర్‌రావు, కంచర్ల పర్శరాములు నాయకులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ముదిరాజ్

ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఇల్లంతకుంట, రహీంఖాన్‌పేట, పొత్తూరు తదితర గ్రామాలలోని పాఠశాలలో ఉపాధ్యాయులను దళిత సంఘాల నాయకులు ఓట్లు అభ్యర్థించారు. నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దండి రవీందర్, బొలుమాల సదానందం, దామెర సత్యం, పులి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

- ఎల్లారెడ్డిపేట : తనను గెలిపిస్తే శాసన మండలిలో పట్టభద్రుల గొంతుకనవుతానని ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం రాత్రి ఆయన ప్రచారం నిర్వహించారు. రవి, లతీఫ్, శరత్‌కుమార్, సంతోష్‌కుమార్, భరత్, రాకేశ్ పాల్గొన్నారు.
- చందుర్తి : పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అల్లాడి రమేష్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోంచెట్టి రాకేష్, భూమేష్, ప్రసాద్, శ్రీహరి, తిరుపతి, సురేష్ తదితలరులు పాల్గొన్నారు.

'హంసనీతి శతకం' పుస్తకావిష్కరణ

బోయినిపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): హంసనీతి శతకం పుస్తకాన్ని గురువారం మండల కేంద్రంలో ఎంఈవో శ్రవణ్ కుమార్ విలాసాగర్ హైస్కూల్ హెచ్ఎం బొలగం శ్రీనివాస్, బోయినిపల్లి హైస్కూల్ హెచ్ఎం భూమయ్యతో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తకం రచించిన, కొలనూరులో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న గుర్రం అంజయ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో బోయినిపల్లి, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట మండలాల తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- ముస్తాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొర్రాయిపల్లె గ్రామంలో గల చౌడలమ్మ ఆలయంలో చోరీ జరిగింది. యాదవ కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన చౌడలమ్మ ఆలయంలో గల 9 కిలోల గంటను దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. హుండీలో గల డబ్బులు తస్కరించారని ఆలయ కమిటీ అధ్యక్షులు దమ్మ మల్లేశం, కుర్మ రాజు, దోమ మల్లేశం, అనమేని పర్వతాలు, సిరవేని పర్వతాలు, కురుమ నర్సింలు, రాగం కిషర్ తెలిపారు.
- చందుర్తి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు బండపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణ కోసం ఐసీడీఎస్ సీడీపీవో సౌందర్య గురువారం స్థలాలను పరిశీలించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ టి శంకరమ్మ, ఆర్ఐ శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్ బుర్ర రేణుక పాల్గొన్నారు.
- ముస్తాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడుగా మహ్మద్ జహంగీర్‌ను నియమించారు. రాష్ట్ర అధ్యక్షుడుగా షేక్‌గౌస్ నియామక పత్రాన్ని గురువారం అందించారు. తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడికి, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.
- ఇల్లంతకుంట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వైశ్యభవనంలో శుక్రవారం కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల సమావేశం జరుగుతుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూంపల్లి రాఘవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హజరుపుతారన్నారు. తొలుత సోమారంపేట గ్రామంలో జరిగే చౌడాలమ్మ ఉత్సవాలలో పాల్గొంటారని తెలిపారు. అన్ని గ్రామాల నాయకులు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.
- సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పాత బస్టాండ్‌లో గురువారం ఓ ఐదేళ్ల బాలుడు తప్పిపోయి ఉన్నాడు. బాలుడికి మాటలు రాక సైగలతో చెబుతుండడంతో స్థానికులు పోలీసులకు అప్పగించారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తల్లిదండ్రులు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్ వచ్చిరాగా, బాలుడిని టౌన్ సీఐ కృష్ణ వారికి అప్పగించారు.
- సిరిసిల్ల టౌన్ ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల మసీద్ కమిటీ అధ్యక్షుడిగా సమీ గురువారం సిరిసిల్లలో బాధ్యతలను స్వీకరించారు. ఎన్నికల అధికారి ముంతాజ్ ఆధ్వర్యంలో మసీద్ కమిటీ బాధ్యతలు సమీ స్వీకరించారు. మాజీ అధ్యక్షులు సయ్యద్ సలీం, సయ్యద్ యూసుఫ్ , నాయకులు రీనా బాబా, ఖాదర్, రఫీ, అక్రమ్, సోహెల్, ముంతాజ్, మునీర్, మెహమూద్, ఫయాజ్, ముజీబ్, షాదాబ్, అంజద్, పాల్గొన్నారు.
- వీర్నపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం బావ్ సింగ్ నాయక్ తండా గ్రామంలో ఇన్‌చార్జి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సీనియర్ మేట్ బానోతు లింబాద్రి ఉపాధిహామీ నిధులను దుర్వినియోగం చేశాడంటూ ఈనెల 7న గ్రామస్థులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం ఎంపీడీవో అబ్దుల్ వాజీద్, ఏపీవో శ్రీహరి గ్రామంలో బహిరంగ విచారణ చేపట్టారు. నిధుల దుర్వినియోగంపై క్షేత్రస్థాయిలో వివరాలను సేకరించారు. పూర్తి విచారణ తర్వాత చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

అక్రమ కట్టడం ఫిర్యాదుపై అధికారుల విచారణ



రోడ్డుపై కొలతలు తీస్తున్న అధికారులు

చందుర్తి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో అక్రమ కట్టడంపై గురువారం అధికారులు చేపట్టిన విచారణ గందరగోళంగా మారింది. ఫిర్యాదుదారులు, నిర్మాణదారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఎంపీడీవో ప్రదీప్ కుమార్ వ్యక్తిగత కక్షలు ఉంటే బయటికి వెళ్లి చూసుకోవాలని ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ప్రభుత్వ బోరును ఆక్రమిస్తూ రేకుల షెడ్‌ను వేశారంటూ ఈనెల 17న ఇదే గ్రామానికి చెందిన కోన శ్రీనివాస్ అనేవ్యక్తి ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు, చందుర్తిలో రోడ్డుపై నుంచి నూతనంగా నిర్మించిన ఇంటి వరకు కొలతలు కొలిచారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో విచారణ చేపట్టడంతో గందరగోళంగా మారింది.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రమాదేవి, గ్రామపంచాయతీ సిబ్బంది, ఫిర్యాదుదారులు, నిర్మాణాదారులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన పాలసేకరణ... రైతులు ఆందోళన



రోడ్డుపై పాలను పారబోసి నిరసన తెలుపుతున్న రైతులు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనేక గ్రామాలలో పాల సేకరణ నిలిచిపోయింది. ఇల్లంతకుంటలోని బల్క్ కూలింగ్ యూనిట్ పరిధిలో 45 గ్రామాల ద్వారా 6300 లీటర్ల పాలను ప్రతిరోజు సేకరిస్తారు. గురువారం రాత్రి పాలను తీసుకొని కేంద్రాలకు రైతులు వచ్చారు. పాలసేకరణ నిలిచిపోయిందని నిర్వాహకులు చెప్పడంతో రైతులు పాలక్యాన్లతో నిరసన వ్యక్తం చేశారు.

- గంభీరావుపేట : మండలంలోని కామారెడ్డి-సిద్దిపేట ప్రధాన రహదారిపై రైతులు బైఠాయించి, రాస్తారోకో చేశారు. పాల క్యాన్లతో రోడ్డుపై బైఠాయించి, కలెక్టర్ తీరుపై మండిపడ్డారు. క్యాన్లలో ఉన్న పాలను రోడ్డుపై పారబోసి నిరసన తెలిపారు. ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది రైతులను సమదాయించే ప్రయత్నం చేశారు. రెండు గంటలపాటు ఆందోళన చేయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.
- ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లోని పాల కేంద్రాలు గురువారం రాత్రి మూసివేయడంతో పాడి రైతులు నిరీక్షించారు. పాల క్యానులతో కేంద్రానికి చేరుకున్న రైతులు గంటల తరబడి ఎదురు చూశారు. పాలను సేకరించమని నిర్వాహకులు పేర్కొనడంతో చేసేదేమీ లేక వెనదిరిగారు.

పౌల్ట్రీ రైతులు జాగ్రత్తలు చేపట్టాలి

చందుర్తి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పౌల్ట్రీ రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ఇన్‌చార్జి పశు వైద్యాధికారి శ్రీధర్ అన్నారు. చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో కోళ్ల మృత్యువాత పడ్డ పౌల్ట్రీఫారంను గురువారం ఆయన సందర్శించారు. కోళ్ల మృత్యువాతపై శాంపిళ్లు సేకరించి పరీక్షల కోసం ల్యాబ్ పంపేందుకు కోళ్లు లభించలేదన్నారు. లింగంపేట మల్యాల చందుర్తి గ్రామాల్లోని పౌల్ట్రీ రైతులు కోళ్ల ఫారంల చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. కోళ్లు మృత్యువాత పడ్డ రైతు కొన్ని రోజులు ఫారంను ఖాళీగా ఉంచి, జాలీలకు మందు పిచికారి చేసిన అనం తరం కోడి పిల్లలను వేయాలని సూచించినట్లు తెలిపారు.

ట్రాక్టరు యజమానులు, రైతుల వాగ్వాదం

- మానేరు వాగు నుంచి ఇసుకను తీయవద్దని కందకం



రోడ్డుకు అడ్డుగా తీసిన కందకం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : తమ గ్రామశివారులోని మానేరు వాగు నుంచి వేరే గ్రామాల ట్రాక్టర్లు ఇసుకను తరలించవద్దని పేర్కొంటూ వెంకటాపూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ల యజమానులు, రైతులు గురువారం రోడ్డుకు అడ్డుగా కందకం తీశారు. ప్రభుత్వం మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి స్థానిక అవసరాలకు ఇసుకను తీసేందుకు అనుమతి ఇవ్వడంతో స్థానిక ట్రాక్టర్ యజమానులు, రైతులు ఆందోళనకు దిగారు. ఇతర గ్రామాలకు చెందిన ట్రాక్టర్లు మానేరు వాగులోకి దిగేందుకు సిద్ధమవగా ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకుని ఇరు వర్గాలను శాంతింపజేయడానికి చేసిన ప్రయత్నం విఫలమైంది. తమ గ్రామం నుంచి ఇసుకను ఇతర గ్రామాల వారిని తరలించనీయబోమని తేల్చిచెప్పడంతో అక్కడకు చేరుకున్న ట్రాక్టర్లను తిప్పి పంపించారు. మండలంలో వెంకటాపూర్, రాగట్లపల్లి, నారాయణపూర్ గ్రామాల శివారులోని మానేరు వాగు నుంచి గతంలో ఇసుక తరలింపునకు సంబంధిత శాఖ అధికారులు అనుమతి ఇచ్చారు. ప్రస్తుతం రాగట్లపల్లి, నారాయణపూర్‌లోని ఇసుక రీచ్‌లను రద్దు చేసి ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాలకు వెంకటాపూర్ మానేరు వాగు నుంచి ఇసుక తీసేందుకు అనుమతి కల్పించారు. దాంతో వెంకటాపూర్ గ్రామంలోని ట్రాక్టర్ల యజమానులు, రైతులు కందకం తీయడంతో ఇసుక వివాదం నెలకొంది.

సేవాలాల్ పందిరి తొలగించిన అటవీ అధికారులు

వీర్నపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం బంజేరులో రెండవసారి వేసిన గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ పందిరిని అటవీ శాఖ అధికారులు గురువారం తొలగించారు. దీంతో గిరిజనులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని ఆ భూమిని ఐకేపీ సెంటర్ కోసం కేటాయించగా, అందులో సేవాలాల్ జయంతి వేడుకలు జరుపు కుంటున్నామని పేర్కొన్నారు. అటవీ శాఖకు చెందిన భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని అధికారులు దురుసుగా మాట్లాడారు. గిరిజనులను కించపరిచే విధంగా మాట్లాడిన అటవీ శాఖ సెక్షన్ అధికారిని భూలక్ష్మి బీట్ అధికారి కిరణ్‌తో పాటు బేస్ క్యాంప్ సిబ్బందిని అక్కడి నుంచి వెళ్లగొట్టారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టి కి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని సేవాలాల్ సోషల్‌సర్వీస్ జిల్లా అధ్యక్షుడు రవి లాల్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిటి యాదవ్ అధికారులు, గిరిజనులకు తెలిపారు.

పంచాయతీ భూములకు హద్దులు..

రుద్రంగి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలోని గ్రామ పంచాయతీ సంబంధించిన భూములకు గురువారం అధికారులు హద్దులు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని గ్రామానికి చెందిన పిట్టల నరేష్ అనే యువకుడు హైకోర్టులో పిల్ దాఖలు చేశాడు. దానిలో భాగంగా సర్వే అధికారులు గ్రామపంచాయతీకి చెందిన సర్వే నంబర్ 428/2, 428/3, 428/4లో ఒక ఎకరం 32గుంటల భూములకు సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారు. ఎంపీవో సుధాకర్ మాట్లాడుతూ పంచాయతీ భూములకు సర్వే నిర్వహించి హద్దురాళ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సర్వే రిపోర్టును జిల్లా అధికారులకు పంపించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

న్యూస్ బాక్స్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లో లబ్ధిదారుడు పర్శరాములుకు మంజూరైన రూ.20 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును స్థానిక కాంగ్రెస్ నాయకులు గురువారం అందజేశారు.

ఈ కార్యక్రమంలో నాయకులు రాజయ్య, బాలయ్య, సురేశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

వీర్నపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం బంజేరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హరిలాల్ నాయక్ తల్లి బుధవారం అనారోగ్యంతో మృతిచెందగా ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డి గురువారం పరామర్శించారు. మృతికి గల కారణాలను హరిలాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బిటి యాదవ్, ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, డైరెక్టర్ మదన్, తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మల్లారం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల వినియోగదారులు గమనించాలని సెస్ అధికారులు తెలిపారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిని కలిసిన నాయకులు

కోనరావుపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన రెడ్డబోయిన గోపన్నను మండల బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు సుదగోని సాయికృష్ణ గౌడ్, గుడిపాటి సుమన్, గుడిసె మల్లయ్య, బుర్ర ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

మీసేవ కేంద్రాన్ని సీజ్ చేసిన తహసీల్దార్

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ దుకాణ సముదాయాల్లో నిర్వహిస్తున్న మీ సేవను వేములవాడ తహసీల్దార్ మహేష్ గురువారం సీజ్ చేశారు. మీసేవ నిర్వాహకుడు ధ్రువీకరణ పత్రాలలో తప్పుడు సమాచారాన్ని ఎంట్రీ చేస్తూ ఇదేమిటని ప్రశ్నించిన వినియోగదారులపై దురుసుగా ప్రవర్తిస్తున్నాడని వస్తున్న ఫిర్యాదుల మేరకు పలుమార్లు హెచ్చరించామన్నారు. ప్రవర్తనలో మారకపోవడం, వినియోగదారులతో దురుసుగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ మీసేవ కేంద్రాన్ని సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.